క్లుప్తంగా

జగనన్నతో రక్షాబంధన్



జగన్‌కు రాఖీ కడుతున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గంగాధరనెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి బుధవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆమె జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడిని వివరించారు. పార్టీ శ్రేణులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



రాజ్‌కుమార్

కార్వేటినగరం: కార్వేటినగరం ఎస్‌ఐగా రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి సీఐడీ విభాగంలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కార్వేటినగరం ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో సారా, గంజాయి. మద్యం అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టేందుకు కృషిచేస్తానని తెలిపారు. అలాగే మండలంలో శాంతిభద్రతలు కాపాడుతానని పేర్కొన్నారు. రాజ్‌కుమార్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు.

మండల మీట్ రేపు

గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ అనిత అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాఘవేంద్ర రాజు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధర నెల్లూరు: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్య సూత్రాలు, వ్యాధులపై అవగాహనతో మెలిగితే ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారిని డాక్టర్ దుర్గాదేవి అన్నారు. కడపగుంట సచివాలయ పరిధిలోని ఎంఎస్ పల్లిలో ఇంటింటి సర్వే నిర్వహించి గ్రామీణ ప్రాంతాల గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ధర్మేంద్ర, హెచ్‌ఎస్ నవీన, ఎమ్మెఎల్‌హెచ్‌పీ మాధవి పాల్గొన్నారు.

మృతుల పేర్లను తొలగించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం: ఓటర్ల జాబితాలో మృతిచెందిన వ్యక్తుల పేర్లను తొలగించాలని తహసీల్దార్ అరుణకుమారి బీఎల్‌ఓలను ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి మృతి చెందిన వ్యక్తులు, వివాహమై ఇతర రాష్ట్రాలకు వెళ్లిన మహిళల పేర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని సూచించారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



మిట్టూరులో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విష్ణుప్రియ

విజయపురం : ప్రతి ఒక్కరూ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు అని డాక్టర్ విష్ణుప్రియ తెలిపారు. మిట్టూరు గ్రామంలో బుధవారం జ్వరం, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. రెండు రోజులుగా జ్వరం ఉంటే వెంటనే స్థానిక ఆస్పత్రిలో రక్త పరీక్ష చేసుకోవాలని సూచించారు. వైద్యుల సలహా, సూచనల మేరకు మందులు వాడాలని చెప్పారు. వీలైనంత వరకు వేడి చేసి చల్లార్చిన నీటినే తీసుకోవాలన్నారు. దోమకాటుకు గురి కాకుండా దోమ తెర వాడాలన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న కొందరికీ వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బండెడు కష్టం.. పిడికెడు ఫలితం

కొండలను పిండి చేయడంలో వారంతా సిద్ధహస్తులు. రెక్కలు ముక్కలు చేసుకుని కొండ, పెద్ద బండరాళ్లను కొట్టి కంకరగా చేయడంలో నేర్పరులు. వారే వడ్డెర కులస్తులు. అనాదిగా బండలపైనే ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నా వారి బతుకులు బండబారడం తప్పితే శ్రమకు తగ్గ ఫలితం లభించక జీవితాల్లో వెలుగు రేఖలు ప్రసరించడం లేదు.

- బండ బారుతున్న వడ్డెర్ల బతుకులు



ఎండలో కొండ సమీపంలో కట్టురాళ్లు కొడుతున్న బోయవాడు

పాలసముద్రం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 2,500 వడ్డెర కుటుంబాలు ఉన్నాయి. కుటుంబ పోషణ నిమిత్తం కొన్నేళ్లుగా కంకర, గోడలు కట్టే రాళ్లను కొడుతున్నారు. రోజంతా శ్రమించినా పూట గడపని దుస్థితి. కాంట్రాక్ట్ మేరకు ఓ ట్రాక్టర్ కంకర కొట్టి ఇస్తే రూ.1,500 వస్తాయి. దీనికి ఇద్దరు మూడు, నాలుగు రోజుల పాటు శ్రమించాల్సి ఉంటుంది. రాళ్లను కొట్టేందుకు కావలసిన సమ్మెటలు, ఇనుప మేకులకు ధరలు కొండెక్కి, రెక్కల కష్టం కూడా దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రెండెకరాల భూమిని ఇచ్చి, బ్యాంకు రుణం మంజూరు చేయిస్తే వ్యవసాయం చేసుకుంటామని వడ్డెర్లు చెబుతున్నారు.

కూలి గిట్టుబాటు కావడం లేదు



ప్రతిరోజూ ఎండలో కంకర కొడుతున్నాం. కష్టానికి తగ్గట్టుగా కూలి ఉండడం లేదు. గ్రామాలు విడిచి పని ఎక్కడుంటే అక్కడికి పోతాం. మా ఊరిలో చాలా కుటుంబాలు రాళ్లు, కంకర కొడుతూ జీవిస్తున్నాయి.
– విజయకుమార్, వనదుర్గాపురం

ప్రభుత్వం చేయూతనివ్వాలి



రాళ్లు కొట్టుకుంటూ బతికే వడ్డెర్లం మేము. మాకు ప్రభుత్వం, ఇళ్లు, బ్యాంకు రుణం ఇచ్చి చేయూత నివ్వాలి. ఎన్నాళ్లిలా రాళ్లు కొడుతూ బతకాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఆదుకోకపోతే వలసలు పోవాల్సిందే. – క్రిష్ణయ్య బోయడ, కేఆర్‌కేపురం

రాళ్లు కొట్టలేక మేస్త్రీ పనులకు వెళ్తున్నా



పదేళ్లుగా రాళ్లు కొట్టే పనిచేస్తున్నా. నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరగడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. రాళ్లు కొట్టీ.. కొట్టీ.. చేతులు బొబ్బలెక్కుతున్నాయి. రాళ్లు కొట్టలేక మేస్త్రీ పనులకు వెళ్తున్నా.
– వేణుబోయడు, గొల్లకండ్రిగ

మూడో రోజూ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

గంగాధర నెల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు మూడోరోజూ కొనసాగాయి. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, గ్రామపంచాయతీలో ఎల్‌ఈడీ వీధి దీపాలు ఏర్పాటుకు సంబంధించిన విషయాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాఘవేంద్రరాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ప్రజల సహకారంతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. శిక్షకులు శ్రీనివాసులు, శివయ్య, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

విజయపురం : మండల కేంద్రంలో జరిగిన సర్పంచ్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. గ్రామీణాభివృద్ధిపై గత మూడు రోజులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో గ్రామాభివృద్ధిపై అధికారులు ప్రణాళిక రూపొందించేలా అవగాహన కల్పించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు కలిసి పని చేయడం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని చెప్పారు. పంచాయతీలో గురువారం జరిగే ఉపాధి గ్రామసభను విజయవంతం చేయాలని ఏపీవో బబిత అన్నారు. మండల కార్యాలయంలో ఉపాధి సిబ్బంది గ్రామసభపై శిక్షణ ఇచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామసభ ఉంటుందన్నారు. ప్రధానంగా ఆయా గ్రామాల్లో జరగాల్సిన పనులపై గ్రామస్తుల తీర్మానం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు

గెస్ట్ లెక్చరర్స్‌కు దరఖాస్తులు

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మ్యాథమేటిక్స్, బోటనీ సబ్జెక్టులు బోధించడానికి గెస్ట్ లెక్చరర్స్ కావాలని ప్రిన్సిపల్ ఎ.రఘుపతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పీజీ అర్హత కలిగి కనీసం 50 శాతంతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు బయోడేటాతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాల ప్రిన్సిపల్‌ను నేరుగా సంప్రదించాలని కోరారు. మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

గర్భిణులకు 'రోజా' పౌష్టికాహారం



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు ‘రోజా చారిటబుల్ ట్రస్ట్’ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచి వుండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మాజీ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పుత్తూరు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా విజిటబుల్ ఫలావ్, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనవద్దు

పుత్తూరు: పట్టణ పరిధిలో తుడా, డీటీసీపీ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్స్‌లో ప్లాట్స్ కొనుగోలు చేయవద్దని మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణ పరిధిలోని నందిమంగళం రెవెన్యూ లెక్క దాఖలాల్లోని సర్వే నెంబరు 102/7పి, 108/8ఎ, పి.లోని 1.08 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు, చెర్లోపల్లి రెవెన్యూ లెక్క దాఖలాల్లోని సర్వే నెంబర్ 59/11పి, 12పి, 17పి, 18పిలోని 0.85 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన లేఅవుట్స్‌కు ఎలాంటి అనుమతులు లేవని, వాటిలో ప్రజలెవ్వరూ ప్లాట్స్ కొనుగోలు చేయవద్దని కోరారు. చట్టవిరుద్ధంగా కొనుగోలు చేసినా, భవన నిర్మాణాలకు, మౌళిక వసతులకు ప్రభుత్వ అనుమతులు మంజూరు కాదని స్పష్టం చేశారు. అనధికారికంగా లేఅవుట్స్ వేసిన వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు అర్బన్ డివిజన్ ట్రాన్స్‌కో ఉద్యోగుల సంఘం 1104 కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ట్రాన్స్‌కో అతిథి గృహంలో బుధవారం వివరాలను సంఘం డిస్కం కార్యదర్శి దేవేంద్రరెడ్డి ప్రకటించారు. డివిజన్ అధ్యక్షుడిగా శ్రీరాములు, కార్యదర్శిగా గోవిందన్, వర్కింగ్ ప్రెసిడెంటుగా మధు, సంయుక్త కార్యదర్శి మురగేసు, కోశాధికారిగా సురేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏకాంబరం, సలహాదారుడిగా సుబ్రమణ్యంతో పాటు మొత్తం 27 మందితో కార్యవర్గం ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు రెండేళ్ల పాటు పదవికాలంలో ఉంటారన్నారు. నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో డిస్కం అధ్యక్షుడు గోపి, వర్కింగ్ అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు గోవిందరాజులు, సురేష్, చిట్టిబాబు నాయుడు, పద్మనాభనాయుడు, అరుణ్, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా

కార్వేటినగరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు నేతలు బుధవారం జాతీయ రహదారులపై పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. చింతమండి వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై వందల సంఖ్యలో దళితులు పాల్గొన్నారు. దీంతో మూడు కిలోమీటర్ల వరకు రాకపోకపోకలు స్తంభించాయి. గాండ్లమిట్ట కూడలి నుంచి ర్యాలీగా వేణుగోపాల స్వామి ఆర్చీవద్ద రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ భగవతికి వినతి పత్రాన్ని అందజేశారు. నేతలు చలపతిరావు, దొరబాబు, సుందర్‌రాజ్, దినకర్ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: ఎస్సీ వర్గీకరణ వద్దు ఎస్సీ ఐక్యమత్యమే ముద్దు అని జిల్లా అంబేడ్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కుప్పయ్య అన్నారు. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి పూల్లూరు క్రాస్ రోడ్డులో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. నేతలు ముత్యాలు, జనార్దన్, బాబు, ఆనంద్, రామకృష్ణ, మహేష్, గోవిందయ్య పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బలిజకండ్రిగ– చిత్తూరు జాతీయ రహదారిపై దళిత నాయకులు నిరసన తెలిపారు. అన్బలగన్, గోపి, గోవిందరాజ్, రాజామణి, అయ్యప్ప, గోపాల్, అంబేద్కర్ పాల్గొన్నారు.



పాలసముద్రంలో నిరసన చేస్తున్న దళిత నేతలు

ప్రశాంతంగా బంద్

నగరి : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన భారత్‌బంద్ ప్రశాంతంగా సాగింది. జైభీమ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పవర్ రామచంద్రన్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ కార్యక్రమానికి మద్దతుగా బీఎస్పీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా బీఎస్పీ ప్రధాన కార్యదర్శి వై నాగూర్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ బాబు, దళిత సీనియర్ నాయకులు ఎంఈ కుమార్ మద్దతు పలకగా పట్టణ పరిధిలో ర్యాలీ చేశారు. రామచంద్రన్ మాట్లాడుతూ రాజకీయ స్వార్థం కోసం అన్నదమ్ములైన మాల మాదిగలను చీల్చి ఒక వర్గాన్ని తమ వైపు తిప్పుకోవడానికి ఈ రాజకీయ కుట్రే కుల వర్గీకరణకు కారణమైందన్నారు. నరేంద్ర మోదీ దేశమంతా మాదిగ వర్గాన్ని తమ వైపు మలుచుకొని ఓట్లను దండుకోవడానికి చేసిన పెద్ద కుట్రే ఈ కులవర్గీకరణ అన్నారు. వర్గీకరణపై ఆసక్తి చూపిన ప్రధాన మంత్రి బీసీలకు రాజకీయ రిజర్వేషన్ ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదన్నారు. దమ్మంటే దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎఫ్ గజేంద్రన్, సెల్వం, రజిని, రత్నం, ఎంకే శశి కుమార్, వడివేలు, పళని, ఎంకె వేలాయుధం, మునికృష్ణన్, రవికుమార్, మైలు సామి, రంగరాజు, సందీప్, ఉమాపతి, ఉదయ్ కుమార్, ఆనందన్ పాల్గొన్నారు.



నగరిలో ర్యాలీ చేస్తున్న దళిత నాయకులు



చింతమండి వద్ద నిరసన

తెలుగుభాషా దినోత్సవం నిర్వహించాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవం నిర్వహించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం డీఈఓ దేవరాజులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు తెలియజేసేలా తెలుగుభాషా దినోత్సవం వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ వేడుకల నిర్వహణ తప్పనిసరిగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక వ్యవసాయంతోనే అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కార్వేటినగరం: సాంకేతిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని తిరుపతి రాస్ కృషి వి/్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ దివ్య అన్నారు. బుధవారం రాజులకండ్రిగ, కృష్ణాపురం, ఆర్కేవీబీపేట గ్రామాల్లో రైతులకు డ్రోన్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. డాక్టర్ దివ్య మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయానికి ప్రధాన సమస్యగా ఉన్న కూలీల కొరతను అధిగమించడానికి సాంకేతిక వ్యవసాయ పనిముట్లు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం వేరుశనగ పంటలకు డ్రోన్‌ల ద్వారా మందులు పిచికారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. రాస్ కృషి వి/్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రామకుమార్, డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, రైతు సమాఖ్య అధ్యక్షుడు నాగేశ్వరరాజు, ఏఈఓ గాయత్రి, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ అడ్మిషన్ల ప్రారంభం

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో గురువారం నుంచి రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికిగానూ బీఏ ఎకనామిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బాటనీ కోర్సుల్లో చేరేందుకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. ఈనెల 24లోపు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరైతే ఉచితంగానే రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యం

కార్వేటినగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యాబోధనలు చేయాలని జిల్లా సైన్స్ అధికారి ఆర్‌వీ రమణ అన్నారు. బుధవారం స్థానిక ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గంలోని ఇన్‌స్పైర్ గైడ్ టీచర్లకు మనక్ నామినేషన్లు–2024–25పై శిక్షణ కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 నామినేషన్లు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 15లోపు www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంఈఓలు విజయకుమార్, మనోజ్ కుమార్, డైట్ అధ్యాపకులు తిరుమలరాజు, చెంగల్‌రాజు, ఆర్పీలు నందకుమార్, ఉమాశంకర్, భవాజాన్, శివలింగం పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందజేయాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

గుడిపాల: మండలంలోని లబ్ధిదారులకు రేషన్ సరుకులను సకాలంలో అందజేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 16వ తేదీ వరకు లబ్ధిదారులు ఎప్పుడు వచ్చినా డీలర్లు అందుబాటులో ఉండి రేషన్ సరుకులను అందజేయాలన్నారు. కొన్ని రేషన్ షాపుల్లో ఆన్‌లైన్‌లో బియ్యం ఉంటే షాపుల్లో బియ్యం లేదని వీటన్నింటిని సరిచేసుకోవాలని డీలర్లకు సూచించారు. కొంతమంది డీలర్లు గోడౌన్‌లో నుంచే బియ్యం తూకాలు తక్కువ వస్తున్నాయని ఆయనకు తెలియజేశారు. వారితో మాట్లాడి వాటిని సరిచేస్తామన్నారు. ఎక్కడా గానీ అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు పీవీకేఎన్‌లో ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దీనికి ఎమ్మెల్యే అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. వివిధ ప్రముఖ కంపెనీలో ఉద్యోగ మేళాలో పాల్గొంటున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దూరవిద్య అడ్మిషన్లు ప్రారంభం



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

పుత్తూరు: బడి మానేసిన విద్యార్థులు, మహిళలు, వృత్తి, వ్యాపార, వ్యాపార రంగాల్లో ఉన్నవారు ఎస్ఎస్‌సీ, ఇంటర్ పూర్తి చేయాలనుకునే వారికి ఓపెన్ స్కూల్లో అడ్మిషన్లు ప్రారంభించినట్లు ఎంపీడీఓ ఇందిర తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్యా విధానం) పోస్టర్లను అధికారులు విడుదల చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ఎంపిక చేసిన ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లో సెలవు రోజుల్లో అభ్యాసకులకు 30 రోజుల పాటు ముఖాముఖీ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఏఐ కో–ఆర్డినేటర్ సునీతను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు, తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మండే ఎండలో హరివిల్లు

పట్టణంలో బుధవారం సాయంత్రం కనిపించిన ఇంద్రధనస్సు పలువురిని అబ్బురపరిచింది. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో జనం అల్లాడిపోతుంటే, మరోవైపు వర్ష సూచన లేకుండానే ఇంద్రధనస్సు ఆకాశంలో కనిపించి పలువురిని ఆశ్చర్యపరిచింది. – నగరి